# ఆ కళ్ళు చూస్తున్నాయి ఆ పిడికిళ్ళు బిగిస్తున్నాయి

—ఘాయల్

వూరికి ఎడంగా వున్న ఆ గూడెంలో గుడిసెలన్నీ కిక్కిరిసినట్టు కుప్పగా వున్నాయి అన్నీ తాటాకు కప్పుగుడిసెలు. మట్టిగోడలు. ఒకటీ అరా ఇటిక గోడల పెంకుటిళ్ళు వున్నా అవీ ఆ గుడిసెలతోపాటే వున్నాయి.

గుడిసెముందు అరుగుమీద మాసిన గోచిపాత కట్టుకొని గోడకాని కూర్చుని చుట్ట పీలుస్తున్నాడు ఐలయ్య. ఇంటి ముందున్న మురుగ్గుంట మీదినించి గంతేసి ఎవరో వాకిట్లోకి వచ్చారు.

వచ్చినతడు గోగుపుల్లలా ఎండి బొగ్గుముక్కలా మాడివున్నాడు. అతడి ఒంటిమీద గోచిపాతా, ముతకబనీనూ తప్ప మరేం లేదు. తలకిమాత్రం బారెడుగుడ్డ తలపాగా చుట్టాడు. అతన్ని చూడగానే చుట్ట నోట్లోనించి తీసి ఆశ్చర్యంగా అన్నాడు ఐలయ్య.

"ఎవరుల్లో! ముత్తన్నా?"

వచ్చినతడు చూరు కిందికి చేరి తలపాగా తొలగిస్తూ ఇస్సురని నిట్టూర్చి "బా! ముత్తయ్యనే?" అని అరుగుమీద కూచుని "అందరు బాగున్నరా?" అన్నాడు.

"మా బాగు కేమయిందిగని, ఎప్పుడొస్తివి ఎటొస్తివి ఏం కత?" అన్నాడు ఐలయ్య ఇంకా ఆశ్చర్యంగానే.

"పకూర్కరుకు వచ్చిన. మా బామ్మరిదికి తొల్సూరు మొగపిలగాడు పుట్టిండంటె సూశెటాన్కి వచ్చిన" అన్నాడు ముత్తయ్య.

"అట్లనా? బాలిగాడికి కొడుకు బుట్టిండా? ఎన్నడూ? తెల్వకపాయె" అని జవాబుకోసం ఆగకుండా "ఎండల బడొచ్చినవు. మంచినీల్లు దాగుతవా?" అన్నాడు ఐలయ్య లేస్తూ. పోబోయి ఆగి "బువ్వ దిన్నవా?" అన్నాడు.

"ఆఁ. బానన్ని నీల్లు తీస్కరా," అని ముత్తయ్య తలపాగాతో ముఖం తుడుచుకున్నాడు. "ఇంట్ల ఎవలు లేనట్టున్నది?" అన్నాడు.

"ఆఁ. తల్లి బిడ్డలు పనికి పొయిగ్రు" అంటూ అల్యూమినియం చెంబుతో ఐలయ్య మంచినీళ్ళు తెచ్చిఇచ్చాడు. చెంబు ఎత్తి గటగటా తాగి మిగిలిన నీళ్ళు మొహంమీద చిలకరించుకున్నాడు ముత్తయ్య. చెంబు పక్కనపెట్టి కాళ్ళు చాపుకుని జారగిలబడి బీడీ అంటించాడు.

ఐలయ్యగూడా చుట్ట అంటించుకుని "మరైతె ప్యాటకు బొయ్యి ఏం జేత్తానవే ?" అన్నాడు.

"ఏమున్నది ? ప్యాటల తీరుతీరు పనులు దొరుకుతయి. అవన్ని జేసుడు మనతోటి ఏమైద్దిగని ఐండి గొడ్తాన." అన్నాడు ముత్తయ్య.

"అట్లనా ? ఆడ్దాని ఏపాటుంటది ? ఇల్లు ఎల్లదీయంగ ఏమన్న మిగు లుతదా ?"

"ఆడ్దాని ముచ్చటా అడిగేది ? గంజి మెతుకు ఎల్లుతె అదే ఎక్కువ" అన్నాడు ముత్తయ్య బీడీని పీలుస్తూ. బీడీ చివర్ల చేదు నోట్లోకి రావటంతో తుప్పున వుమ్మి మూతి తుడుచుకున్నాడు.

"ఎక్కడికి బొయినా గివే బతుకులు. ఎంతకు మారయి." ఐలయ్య విచా రంగా వ్యాఖ్యానించాడు.

"ఈడ ఎట్లున్నది ? సీతయ్య దొర సంగతి జెప్పవైతివి ? అట్లనే వున్నదా యవారం ! ఐనా దొరోడు మారుతాడు ? వాన్ని గోశినాగూడ మారడు." ముత్తయ్య అన్నాడు.

"అబ్బో ! వాని ముచ్చటడుగుతానావు ? మాలమాదుగు లందరిమీద వాని కెందుకింత కండ్లకుట్టో అర్తమైతలేదు. ఇప్పటిగ్గూడ జులుం సాగిస్తనే వున్నడు గని సాగుతలేదు. మనోడు గిరి బూశనం లేదయ్య ! జోపుతాండు. మనకాలంల అడిగెటానికి బయపడే ముచ్చట్లన్ని అడుగుడేగాదు. ఇప్పుడు ముప్పయి నలబై ఎకురాలల్ల మనోల్లు జెండాలు పాతి దున్నుడు మొదలుబెట్టింగ్రు ఎరికేనా ?"

"ఆఁ. గిన్ని జరిగినయా ? మరి దొరోడు ఊకున్నాడే ? వాడసలే పగ బట్టిన పాము గాదు !" ముత్తయ్య ఆశ్చర్యంగా అడిగాడు.

"ఊకుంటాడు ? ఎవడు జెప్పిండు ! వాడు అమీనోన్ని తీసుకోని ఊరెక పట్టుకచ్చిండు. ఆగమాగం జేపిచ్చిండు" ఐలయ్య అన్నాడు.

"చెప్పవు మరీ! దొరోని సంగతి ఎవని కెర్కలే. ఐలన్నా? వీడ్దెటు పంటి పుటుకోగని రెడ్డోడు, ఎలుమోడు ఇనుమంటి కలిగోరాలు జెయ్యంగ జెయ్యంగ జూసినంగని బాపనోడై వీడు గింతకు ఎట్ల తయారైండే! రావునాసురుని అంశల బుట్టిండు లుచ్ఛ ముండకొడుకు!" ముత్తయ్య బీడీ అఖరి పీల్పు పీల్చిపారేసి తుపుక్కున ఉమ్మి మూలి తుడుచుకున్నాడు.

"దానిదేమున్నదే? అస్తులు రాంగనె దాన్ని కాపాడుకోవాల్ననే సోయి గూడ అత్తది. అందుకోసం ఎంతకైన తయారైతరు" అంటూ ఐలయ్య వీధివైపు చూశాడు.

"పొద్దు వాలిపోతాంది. రాకరాక అచ్చినవు. లేశి జరంత అటు బోదాం పారాదు!" అన్నాడు.

"ఎందుకు తియ్యరాదె! కరువుకాలంల అదో కర్సు" నిరాకరించాడు ముత్తయ్య.

"ఎహెఁ. పారాదు! ఊకె నువ్వు రాబోతవా? నేను జెయ్యబోతనా! నాల్రాపాల కల్లుకోసం మునిగిందేందట?" ఐలయ్య ముత్తయ్య చెయ్యిబట్టి లేవదీశాడు.

గుడిసె తడక లాగి తాడు ముడివేసి ఇద్దరూ బయల్దేరారు. వాళ్ళు గుడిసెల్ని దాటుతూంటే ఒకరిద్దరు వృద్ధస్త్రీలు తల బయటకుపెట్టి చూశారు. ఒకామె పిలిచింది.

"ఎవరే ఐలయ్యా! నీతోని ఉన్నాయినెవలు?"

ఐలయ్య ఆగాడు. "మన ముత్తిగాడే! యాదికి లేదానే ఆరేండ్ల కింద ప్యాటకు బతుక బొయిండు. గ వాడే!"

ముసిల్ది గుడిసెలోంచి పరిగెత్తినట్టుగా వచ్చింది. ఆమె ఒంటిమీద పీలికల చీరా, అతుకుల రవికా ఉన్నాయి. చర్మం సంచుల్లాగా వేలాడుతోంది. గోనె పుల్లల్లాంటి వేళ్ళతో ముత్తయ్య ఒంటి నిమిరింది. ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి.

"నువ్వానే! లచ్చక్కా! శీ, యెదవజల్మ నాకు నీ సంగతే యాదికి రాలే! బాగున్నావే! ఎట్ల బతుకుతానవే!" అన్నాడు ముత్తయ్య తనని తను తిట్టుకుంటూ.

ముసిల్ది రాగాలు మొదలెట్టింది ముత్తయ్యని కావలించుకుని. "ఎట్లునోల్లెట్ల ఎట్లయిపోతిరో కొడుకో!.... అప్పుడు నీకు రెండు నాగండ్ల యవసాయం ఉండేదిరో నాయినో.... దొరోని కండ్లల్ల బడితివో నాయినో.... అంత అయిపోయిందిరో బిడ్డో.... వాని కండ్లల్ల జిల్లేడు బూశిందిరో అయ్యో.... వాని తలపండు పలుగ గదరో బిడ్డో.... మిమ్ముల నిట్ల జేశిండు గదర బిడ్డో.... ఊరొదిలి పోతివిగదరో అయ్యో! నేను లేననుకున్నావుర నాయినో....వద్దని ఎంత బతిలాడితిరో నాయినో.... నీ పట్టు నీదేనాయె బిడ్డో.... అడి పోరగాల్లు పచ్చులసొంటోల్లు బిడ్డో.... ఎట్ల ఎల్ల దీత్తాంద్రో నాయినో.... నాకు సావన్న రాదాయె దేవుడో...."

ముత్తయ్య ముసలిదాన్ని ఓదార్చాడు. "ఊకోవె! అయిపోయిందానికి ఏడిశేం లాబం?"

ముసిల్ది ఆగి బ్రువపేది మళ్ళీసాగించింది. "ఊరుగాని ఊరుబోతివి బిడ్డో! .... ఎట్ల బతుకుతాంద్రో నాయినో.... పోరగాల్లు ఆగమైరి దేవుడో.... దొరోనింట్ల మన్ను బొయ్య గదరో.... వానింట్ల గడ్డిమొలువ గదరో.... వాని కూన్లె పురుగులు బడ గదరో...."

ఈ రాగాలకి గుడిసెల్లోని ఆడంగులు పదిమందీ చేరారు. అందరూ ముత్తయ్యని పరకాయించి చూసి "బాగున్నావె ముత్తన్నా!" అని పలకరించి ముసలిదాన్ని ఓదార్చారు.

"ఊకో ఊకో. ఇగ అంతయిపాయె. ఏడుత్తె అత్తదానె!"

ముసిల్ది ఆగి ముక్కు మళ్ళీ ఓసారి చీది కొంగుతో కళ్ళు తుడుచుకుంది. "ఎటువంటోడు ఎట్లయిండు?" అని ఆడాళ్ళంతా ముత్తయ్యని చూసి నోళ్ళు నొక్కుకున్నారు.

"అందరు బాగున్నారే! పిల్లలు గిట్ల మంచిగున్నరా?" ఒకావిడ అడిగింది.

"ఆఁ. అందరం మంచిగనే ఉన్నం. ఏదో ఇంత కూటికి ఎల్లుతాంది. సావలేము. బతుకలేము. మన బతుకుల తీరే అంత" ముత్తయ్య నిట్టూర్చాడు. ఆడాళ్ళు నలుగురైదుగురు కళ్ళు తుడుచుకున్నారు.

522

"పెద్దాని పెండ్లి జేసినావె?" అందొకావిడ.

"మిమ్మల్ల బిలువకుంటనే జేత్తనా ?" అన్నాడు ముత్తయ్య.

"సరె. దా ! మనం మల్లత్తం గద. అచ్చినంక కూసోని అన్ని మాట్లాడుదురు తీయిర్రి." అని ఐలయ్య ముందుకు కదిలాడు.

ముత్తయ్య అతన్ననుసరించాడు.

× × ×

వాళ్ళు మళ్ళీ వచ్చేసరికి పూర్తి చీకటి పడింది. గుడిసెల్లో చమురుదీపాలు వెలుగుతున్నాయి. వాటి చూరుల్లోంచి పొగ పైకి లేస్తోంది. పిల్లలు వాకిళ్ళ ముందు దిగంబరంగా దుమ్ములో ఎగురుతున్నారు. పనులకు వెళ్ళొచ్చిన ఆడవాళ్ళు లోపల వంట ప్రయత్నాలలో వున్నారు. చంటిపిల్లల ఏడుపులూ, బిడ్డతల్లుల గద్దింపులూ విన్పిస్తున్నాయి. ఎవడో కుక్కిమంచంలో పడుకుని ఏదో లొల్లాయిపదం పాడుతున్నాడు. ఎవరో స్త్రీ భర్త స్నానం చేస్తుంటే బండమీద నిలబడి వీపురాస్తోంది.

చీకట్లో గుడిసెల్ని దాటుతూ ఐలయ్య గుడిసె దగ్గరికి వచ్చేసరికి అక్కడో పదిమంది దాకా చేరివున్నారు. వీళ్ళని చూడగానే "అగో వచ్చిన్రు" అన్నా డొకడు.

ఐలయ్య భార్య వీరమ్మ గుమ్మంలోంచి లేచివచ్చి ముత్తయ్యని కౌగలించుకుని "మామీద ఎన్నిరోజులకు దయగలిగిందే అన్నా! ఐనోల్లకు దూరం బోతివి గదనే తండ్రో ?" అని ఏడుస్తూ పరామర్శించింది.

"ఊకో. ఊకో చెల్లె ఊకో! ఏదో బతికుండబట్టి ఈమాత్రం అందర్ని జూత్తాన. ఆనాడె పిడాత జస్తె అందరికి దూరమవుదు" ముత్తయ్య వీరమ్మని ఓదార్చాడు.

ఈ గోలకి ఆడా మగా అందరూ వచ్చి చేరారు. "అయ్యో? కూసో నిత్తరా లేదా." అని ఐలయ్య దారితీసి లోపల్నించి నులకమంచం తెచ్చి బయట వేశాడు.

ఐలయ్యా ముత్తయ్యా మరికొందరు ఆ మంచంమీద కూచున్నారు. మిగతా వాళ్ళు అరుగుమీదా, పెద్దరోలు మీదా కూచున్నారు. ఆడవాళ్ళు గుమ్మం పక్కగా నీడలో నిలబడ్డారు.

523

లోపల వంటపనుల్లో వున్న ఐలయ్య కూతురు లక్ష్మి గుడ్డిదీపం తెచ్చి వాకిట్లో వుంచింది.

"బాగున్నవా బిడ్డా!" ముత్తయ్య అడిగాడు. లక్ష్మి తలవూపి లోపలికి వెళ్ళి తలుపు పక్కన కూచుంది. గుడిసెలలోంచి పిల్లల గోల వినిపిస్తోంది.

"రాజవ్వగిన బాగున్నారె! ఎట్ల ఎల్లదీత్తాన్రో ఏందో?"

"ఏం బాగుండుడు? ఏమంట వూరొదిలి పోయినమో దయిద్రం జుట్టుకున్నది. ఉన్నజాగ పోగొట్టుకోని ప్యాటకుబోతె ఉండ ఇల్లా, తిన తిండా? పక్కోన్ని పాపుశేరు గింజలడుగుతెగూడ బుట్టయి. మాగోస ఎవనికి జెప్పేదిగాదు. ఒకడు దీర్శేది గాదు." ముత్తయ్య మాటలకి పక్కనే కూచున్న వెంకటేశ్వర్లు అన్నాడు.

"నువ్వంటె ఊరు వదిలిపెట్టి పోబట్టి ఆయింత ప్రానబయం లేకుంట ఉన్నవు. ఈడ పొలాలు బోగొట్టుకున్నోల్లం మేమంత ఇండ్లున్నయి గదాని ఉండుడే ఎప్పుడేమయిద్దో ఎవడేం జేత్తడో తెల్లారి లేశెవరకు ఏ శిక్కలు నోరుతెర్సుకోని కూకున్నయోని బయమేనాయె."

"అదె! అంత తిప్ప లేమొచ్చెనే!"

"ఏ మచ్చెనా? నీకెర్కలేని దున్నదా జెప్పరాదు. ఇప్పుడంటే ప్యాటకు బోతివిగని అంతకుముందు ఇక్కడోనివి గాదా. సీతయ్య దొర పంచాయితి పశిడెంటు గున్నప్పుడు గౌర్మెంటురేడియ తీస్కబోయి ఇంట్ల బెట్టుకోని ఏమన్నడు? 'మీ కెందుకురా రేడియ? మీ మొకాలకు ఇంక అదోటా?' అన్లే? గప్పుడు మన పీరయ్య గిట్ల ఎదురుదిరిగిన్రు సూడు, గక్కన్నుంచి ఇగ మొదలనుకోరాదు! అంతకు ముందుగూడ ఉన్నయిగని ఇంతబాగ అడిగినోడు లేడాయె. వీడడిగెవరకు వీనిమీద కన్నుబడ్డది." నేను చెప్పేది నిజమేనా అన్నట్టు, ఆగి ఇతర్ల మొహాలు చూశాడు వెంకటేశ్వర్లు. అందరూ బాగుంది అన్నట్టు తలూపారు.

"అంతటితోటి పోతె బాగుండు. మన నరేందర్, ఏలిషా, గిరిబాశనం అందరు ఎదురుతిరుగుడు మొదలుబెట్టిన్రుగద. మల్ల వీల్లంత అన్నదమ్ములై పోయిరి. గదాన్తోటి ఇంకింత కచ్చబెట్టుకున్నడు దొరోడు." అన్నాడు వెంకటేశ్వర్లు.

"అంటె అన్యాలం జరుగుతాంటె అడిగినోడు శెడ్డోడా?" ముత్తయ్య వెటకారంగా అని బీడీ తీసి ముట్టించాడు.

"అన్నట్టేగద మరి! లేకుంటె వాడేమంటడు ? మీదే నాయం ధర్మం అంటడా ?"

"అవురా బిడ్డా ! ఈ దొరలందరిది పులిజాతి. వాల్లకు మందిబూములు దొబ్బుడు రుశి దొరుకనేవద్దు. దొరికిందా మనిసి నెత్తురు మరిగిన పులితీర్గ ఇగ ఆగరు. కుటుంబాలు, వాడలు, ఊల్లు, తాలూకలు, జిల్లలు మొత్తం బూమండలం గూడ వాని ఆకలికి సాలది." ముత్తయ్య నిట్టూర్చాడు. బీడీ పీల్చి గుండెలనిండా పొగ వదిలి క్షణంసేపు కళ్లు మూసుకున్నాడు.

ఆ చీకట్లో తదియ చంద్రుడు గుడ్డి వెన్నెల్ని వెదజల్లుతున్నాడు. గుడ్డి దీపం వెలుతురు ముత్తయ్య మొహంమీద పడి అరవై ఏళ్ళ శరీరపు ముడతలలోంచి జారిపోతోంది.అతడి ముఖంలో వికృతపు నవ్వొకటి ద్వేషంగా వెలిగి ఇలా అన్నాడు.

"నా పొలం ఎట్ల బోయిందో మీ కందరికీ ఎరికే. అసలు ఆ పొలం నా కెట్ల వచ్చిందో మీ కెర్కలే.

ఇప్పుడు మన దొరోడు సీతరాంరావు ఉన్నడు సూడుర్రి వాడెట్ల ఇల్లటపు అల్లుడో వాని మామ రాజేస్రరావు గూడ ఈ వూరికి ఇల్లటం అచ్చినోడే. అయితె వాని మామ పూర్వీకులు మన ఎర్రబెల్లి, తుప్పరపెల్లి, రంగెం, ఇనుమంటి వూల్లను- ఏంది వూల్లనే - పంచుకున్నరు. వచ్చి ఊల్లల్ల జేరి గీన్నుంచి గీడిదాక బూమంత నాది అనుకున్నరు.

బూమిని కబ్జజేసోకుంగనె ఏమైద్ది ? దున్నుడు, పండిచ్చుడు రావద్దా ? బాపని మొకాలకు నాగలి సంగతేమెరిక ? ఇగప్పుడు మనటువంటి సుద్దరి జాతులకు కౌలుకిచ్చిర్రు.

తరాలు గడిశినయి. మన నెత్తురంత మట్టినిండ అలుకుజల్లి పంటలు పండిచ్చినం. గరిశెలు నిండెటోనియి నిండినయి. ఎండినోని కడుపు లెండేపొయినయి.

ఇంతలకు మన రాజేస్రరావు బూమిమీద అతికారంల కచ్చిండు. ఊరికి పట్వారి పటేలు ఆయెనే. కమినిస్టోల్ల విద్దం తర్వాత గౌర్మెంటు ఏదో వచ్చపారాలు కౌలుదార్లకిత్తె, ఆయెనె దాన్ని ఎట్లనో సవరిచ్చుకున్నడు. ఆ యెనక నెహ్రుసాబ్ సచ్చిపోక ముందు ఏదో సట్టం తయారు జేసి దాన్ని గట్టిగ అమలు జెయ్యాల్ననే టాల్లకు - వూరి పట్వారి అయినేగద —. పాణీలల్ల ఒక తీర్గ, సైసు రికాట్లల్ల ఒక తీర్గ ఇగ ఎట్లనోగని మొత్తం మల్ల వాల్లకే ఉండెటట్టు జేసుకున్నరు.

525

ఇగ రాజేసర్రావుకు ఒక్కతే బిడ్డ అదిమెటాల్లకు సీతయ్యను ఇల్లటం దెచ్చుకున్నడు. అయినె రాంగనె సిచ్చు మొదలైంది"

ఆగి ముత్తయ్య బీడీ వెలిగించుకున్నాడు. వింటున్నవాళ్ళు మాట్లాడితే విషయం మారిపోతుందని నిశ్శబ్దంగా ఉన్నారు. ఆడా మగా అందరూ ఉత్సాహంగా వింటున్నారు. కుర్రకారయితే మరీ జాగ్రత్తగా వింటున్నారు.

ముత్తయ్య బీడీ అంటించుకునేలోపల తోడుగా ఐదారు బీడీలు, రెండు మూడు చుట్టలు వెలిగాయి. ముత్తయ్య మళ్ళీ అన్నాడు.

"సీతయ్యదొర రాంగనే నాగండ్లు బాయి టాక్టర్లచ్చినయి. మోటబావులు బొయి కరంటు ఇంజన్లచ్చినయి. కూలోల్లు దప్ప కౌలుదార్లు అక్కెర లేకుంట అయిర్రు. ఇగప్పుడు మా అసుమంటి ముసలి ముండకొడుకులం ఏం గావాలె ? తాతలు తండ్రుల కాన్నుంచి బూమిని సాగుజేస్తుంటిమి. ఇయ్యాల ఏకొదమ్మన 'దూశ్ పోర్రి' అంటె ఎటుబోదుము ? ఏదో సంతానికి మిగిలిందున్నది దాన్నిబెట్టి మల్ల గొందాం బూమిని అంటె - అసలు పైసలు మిగిలిందేడ ? సరె అప్పోసప్పో జేసి గొందామంటె అసలు బూమి ఉన్నదేడ ? ఊరి బూమంత వాల్లదేనాయె. ఏదో ఏరే కులాలున్నయి, వాల్ల బూమున్నదాంటె అదిగూడ లేదాయె. కాపులు గిట్ల ఉన్నరుగని వాల్లకున్నదే ఐదు పదెకురాలు. అవి వాల్లకే సాలయి. అమ్మేడు ముచ్చటెక్కడిది ? దొరోడు అమ్మితె గొనాలె లేకుంటెలేదు. గది పరిస్తితి.

ఇగ ఇండ్లనే లొల్లి ల లొల్లని సీతయ్యదొర పంచాయితి సర్పంచు అయిండు, ఇగ గౌర్మెంటు రేడియ వానిదే. బడి వానిదే. ఏమన్న అడుగబోతె మాదిగ్గాడిది కొడుకులాల ! మీ మొకాలకు సదువు గావాలె రేడ్య గావాల్నార ?' అనుడు !

ఏమన్నంటె వానికి మినిష్టర్లతోటి గిట్ల సంబంధాలున్నయి. ఏం జెయ్యకుంట అడుగకుంట అయింది ముచ్చట. అటువంటి టయింల నా అటువంటి రక్తం జచ్చినోడేమొ ఇల్లు వాకిలమ్ముకోని దేశాలుబట్టి పొయిండు. ఇగ మీ అసొంటి వయసునోళ్లేమొ తెగబడి ఎదురుదిరిగిర్రు.

అసలు వాడు ఈ బూమి నాది అనేదాక ఎవనికన్న ఇది పరాయినేల, దీంట్ల పనం పంజేత్తానం అన్న సోయి ఉన్నదా ? సంత బూమి తీర్గ దాన్ని సవరచ్చన జేసిరి."

ముత్తయ్య ఆపగానే అందరూ ఒక్కసారి ఊపిరి పీల్చారు. "గింత కథున్నదా ఐతె!" అనుకున్నారు.

వెన్నెల వెలుగు గుడిసెలమీదా జనాలమీదా సన్నగా పడుతోంది. అందరూ ఏదో ఆలోచనలలో మునిగివున్నారు. ముసలాళ్ళు తాగుతున్న చుట్టలు ఆరిపోయిన సంగతిగూడా చూసుకోలేదు. వాళ్ళని పూర్వపు జ్ఞాపకాలు ఎటో తీసుకెళ్ళాయి.

ఐలయ్య అన్నాడు. "కని పరిస్తితి అప్పటితీర్గ లేదే? ఇప్పుడు మన గిరిబూశనం గట్టిగ తయారైండు. ఇనుమంటియన్ని వాడు సైసుత లేడు. ఒగసారి ఏమైందెరికేనా?" అని ఆగి వెంకటేశ్వర్లుకేసి చూసి "ఆనాడురా!" అన్నాడు.

వెంకటేశ్వర్లు అవునన్నట్టు తలాడించాడు.

"సీలింగుల మిగిల్న బూములమీద అతికారం మనదేనని మన గిరిబూశనం ముప్పై నలభై ఎకురాలల్ల దున్నుడు మొదలుపెట్టిచ్చిండు. గిది సీతయ్య దొరకు మండుకచ్చింది.

ఇగ ఆనాడు అమీన్ను తీస్కచ్చిండు సీతయ్యదొర ఊల్లెకు. ఆని పేరు ఏందో ఉన్నది. ఆడు అచ్చి సైకిల్ మోటరు దొరోని ఇంటి ముంగల ఆపిండు. సీతయ్య దొరున్ను, ఆడు ఇద్దరు గల్సి అచ్చి మన గిరిబూశనం ఇంటికి కాసంత దూరంల ఆగిండ్రు. సీతయ్య దొర ఏం జేశిం దెరికేనా? గిరిబూశనం ఇల్లుజూపి ఎన్కకు బోయిండు. అమీనోడేమొ ఇల్లు వాకిలి గొట్టి గిరిబూశనాన్ని పిల్సిండు.

లోపలికెల్లి గిరిబూశన మచ్చిండు. రాంగనె పోలీసోడు వాని చెయ్యి బట్టుకోని నడువ మంటడు! ఎందుకయా అంటె నడువు నడువు! అంటడు. నేనేం తప్పు జేసిన్నయా అంటె తప్పులేదు గిప్పులేదు నడువుడే! అన్నడు. గిరిబూశనం గానికి లిక్కదొచ్చి నేన్రాను పో అన్నడు. రమ్మని పీడు గుంజిండు. ఇద్దరు జరంత కలెబడ్డట్టు జేసిన్రు. గుంజులాటల గిరిబూశనం అమీనోన్ని కిందబడేసి తొక్కిండు. ఇగ అమీనోడు అది మనుసుల కచ్చబెట్టుకున్న డనుకోరాదు! బూముల కేసొగటి, అమీన్ను గొట్టిండని ఒగటి రొండుకేసులు ఒక్కసారే బెట్టిండు. అయింత గిరిబూశనం తప్పిచ్చుకోని ఉరికిండు.

ఇగజూడు షురువైంది కత. ఊల్లోలందరిమీద దొంగకేసులు బెట్టిన్రు. మన ఎంకటేసర్లు గాని మీద గూడ బెట్టిన్రు. ఈడు గిరిబూశనం గానికి సుట్టం అయితడు గద!

గిరిబూశనం గాడేమొ వూల్లె సంగం బెట్టిండు. దాంతోటి పెద్దపెద్ద యవారాలు నడిశినయి. ఎన్ని వూల్లల్ల ఎంతమంది మనోని మాటమీద నిలబడుతరో ఎరికేనా ? అందర్ని కూడగట్టిండు. ఈ సుట్టుపక్కల వాని పేరు తెల్వని పేదోడు ఉన్నాడే ? దొర్లకైతే ఇగ ఉచ్చే పడుతది. సీతయ్య దొరైతె ఊరొదిలి ప్యాటల మకాం బెట్టిండు. ఎరికేగద !"

ఐలయ్య ఆగాడు.

"అయ్యో ! నడుమ ముచ్చట మరిశేపోతివి !" అన్నాడు వెంకటేశ్వర్లు.

"ఏందిర అదో !" అన్నాడు ఐలయ్య.

"సరె ! నేనేం జేసిన గదాంటె, దసర దీపాలిరోజుల్ల ఒక అరెకురం పొలం గొందామని సీతయ్య దొర దగ్గెరికి పోయిన. అయినె అప్పటికె పొలాలన్ని అమ్ముకుంటాండు. ప్యాటల ఉంటాడుగద ! సరె బేరమైంది. ఎనిమిది వందలు బయాన ఇచ్చిన. మిగిల్ని పైసలు రొండు మూడు నెల్లల్ల ఇత్తనన్న. వాడు సరె నన్నడు. అప్పుడె రజిస్టేరిషను గిట్ల అయిద్ది.

ఇంతల ఐలయ్య జెప్పినట్లు ఆమీను వచ్చి డు. గిరిబూశనంగాన్ని గుంజుతాంటె నేను, ఇంక శానమందిమి అడ గూడినం. కూడినం గని ఎవలం ఏమనలే. కని తర్వాత ఏమైందెరికేనా ? ఆ దొంగ కేసుల్ల నా పేరుగూడ సీతయ్య పెట్టిచ్చిండు. గిదెక్కడి కతరో అని నేను ఊరు వదిలి తిరుగుడు బెట్టిన. ఇంతల పొలం బేరానికి పెట్టిన వాయిద దాటిపోవచ్చింది. సరె. పోలీసు మాములాల ఇరికినగద. టైమియ్యక పోతడా అని మరిగీర్గ ఉన్నదిగద యవారం, ఇది అటో ఇటో తేలేదాక ఇంకో రొండు నెల్లు ఎక్కువ టైమియ్యి అని మనుషుల బంపిన సీతయ్యదొర దగ్గెరికి. వాడు ఎసుమంటోడో గని సప్పుడులేదు సడిలేదు. అరె ఏందిరా అని పరేషానై తాంటె పోలీసులే నామీద కేసు తీసేసిన్రు. ఇగ అప్పుడు బొయ్యి ఏంది ముచ్చట అంటె, గడువు దాటినంక అచ్చినవు గద ! ఇంకేంది ? నీ బయాన జప్తయింది పో ! అన్నడువాడు.

మరికేసుల నాపేరు ఇరికిచ్చింది నువ్వేగదయ్య అంటెగదంత నాకేమెరిక ? అంటడు. "నాగ్గూడ గిట్ల దోకాయిచ్చి ఎనిమిది వందలు దొబ్బిండు." అన్నాడు వెంకటేశ్వర్లు.

528

"వానికి గీ ఎనిమిది వందలు కరువైనయటనా? " అందొక స్త్రీ.

"ఎనిమిది వందలాబాయె! ఇన్నిరోజులు ఇట్ల బట్టకుంట పెండ్లాం పిల్లల కానకుంట తిరిగితి" అన్నాడు వెంకటేశ్వర్లు.

"వీని మొల్తాడుతెగ! వీనికి నాశన గాలం రాదేందో!" ఇద్దరు ముగ్గురు స్త్రీలు ఆశీర్వచన వచనలు చదివారు.

"ఇది వానికి నాశనగాలం గాకుండె మంచి కాలమా" అన్నాడు వెంకటేశ్వర్లు.

"యేం నాశనగాలం, అందర్ని గొట్టెయ్యబట్టె పోలీసుల కప్పజెప్పబట్టె మన గిరిభూషణాన్నయితె రొండుసార్ల సంపుదామనె సూసిరి. ఒగసారి పోలీసు చేశన్లకడ్డీకాల్చి నడుంమీద వాతలుబెట్టిరి. ఇగ నాశనకాలం మనకా వానికా" యెవరో ఒక స్త్రీ అంది.

వెంకటేశ్వర్లు నవ్వాడు- "గట్లనే వుంటదే- నువ్వు మీదికి గనబడేదాన్ని సూత్తానవు - వాడిప్పుడు ఈ పొలాలన్ని యెందుకు అమ్మక దొబ్బుతాండంటవ్. ఊళ్లె వుండకుంట ప్యాట కెందుకు బోయిండంటవ్ - పోలీసులు పటేలు పట్వారి అందరు వాని మనుసులేనాయె - ఇగమరి వానికి బయమెందుకు? వాడందర్ని తిప్పల బెడతాండు నిజమే కని వానికి గూడ యెరికే గిది యెక్కువకాలం నడువదని - మనం ఇన్నిగోసల బడితిమి. పోలీసుచేషన్ల బడితిమి - అయినగూడ వూకున్నమా చేసేది జెయ్యనే బడితిమి - అందుకే వాడు ఒక్కొక్కటి దాటిత్తాండు - అసలు గిది మనం పెరిగే కాలం, వాడు తరిగే కాలం - కొద్దిగ యిచారించి సూత్తె అర్థమయితది" అన్నాడు.

అక్కడున్నవాళ్ళంతా తలలూపారు.

ముత్తయ్య బండ పెదాలు సాగదీసి నవ్వాడు-

"మంచిగ జెప్పినవుర బిడ్డ - మీదికి జూత్తె వాన్దే పైచెయి అనిపిత్తది గని గెల్సింది మనమేరా - నూరోజుల్లనే యిట్ల జేసుందుముగద గిప్పుడు ఈ సీతయ్యలు, రాజేసర్రావులు ఈపాటికి వుండకపోదురు. మీ ముచ్చట్లన్నింటాంటె నామనసుల ఆశబుడుతాంది" అన్నాడు.

"గంతేమరి - ఎన్నడోనాడు ఎవడో వాగడు యేన్నోవోకడ మొదలు బెట్టకపోతె ఇగ దానికి అంతెక్కడిది - అపని మన గిరిబూశనం జేసిండు - ఒక్క

మన తాలూకల్నేగాదు సుట్టుపక్కల తాలూకల్ల గూడ పేదోడనెటోన్నల్ల కూడ గట్టిండు - సంగంబెట్టి వూల్లమీద తండలమీద ఎర్రజెండ ఎగరేసిండు - దండుగలని ఇదువరకు వసూల్జేసిన పైకలన్ని పల్లె యెవనియి వానికి యిప్పిచ్చిండు.

దొంగ బాకీల కింద జప్తయిన బూములన్ని యెవనియి వాన్ని దున్నుకో మన్నడు - బూసాముల మనుసులత్తె ఎదురు నిలబడ్డడు - వాని సపోటుగ మంది అందరు నిలబడ్డరు - యిగ యెవన్తోటి యేమైతది - తోకదీకిన్రు". అయిలయ్య తమ విజయాల తాలూకు గర్వం మొహంలో వెలుగుతుండగా అన్నాడు.

తదియ చంద్రుడు అస్తమించదానికి సిద్ధంగా వున్నాడు. గుడిసెల మీది నుంచి వీస్తున్న గాలి వేపపూల వాసనను వరిగడ్డి పరిమళాన్ని మోసుకొస్తోంది.

జనాల్లో ఒకరిద్దరు మళ్ళీ చుట్టలు బీడీలు వెలిగించారు-

"యింక యినవూ, భూసాము లెంబడే గాదు, సారముస్తాజర్ల యెంబడి గూడ దగిలిండు - వాల్లు వూకె మోటర్లల్ల రాకడ, గుడిసెల్ల సొర్రుడు, మొగోల్ల కొట్టుడు, ఆడోల్ల గుంజుడు, సొమ్మేదన్న దొరుకుతె ఎత్తుకపోకడ, మందిని పట్టుక బోయి జుల్మానా లేసుడు. గివన్ని జరిగెటాల్లకు మనోడు ఆ రంగంలగూడ దిగిండు - దాంతోటి సారముస్తాజర్ల మనుసులు ఊల్లల్లకు వచ్చెటానికి బయపడ్తాంద్రు - యిగ గప్పుడేసుయిం దెరికేనా. యిటు బూసాములు వాల్ల మనుసులు, అటు సారముస్తాజర్ల వాల్ల మనుసులు వీల్లిద్దరు గల్సి యెగేసిన పోలీసులు మనోని యెంబడిబడ్డరు. వాడు తెడ్డుగూడ దొరుకలే - ఊల్లకూల్ల తండలకు తండలు వానెనుక నిలబడ్డయి. వానికి బయమే లేదు - యెర్రజెండ బట్కోని యిదే మన బలం అంటడు. నా పానం బోతేంది! మనం మొదలు బెట్టిన యిద్దం ఆగుద్దా? అంటడు - గనుమంటోన్ని యెవడేం జేత్తడే" అన్నాడు అయిలయ్య.

అతడి ముఖంలో రాబోయే విజయంమీద విశ్వాసం కనిపించింది.

ముత్తయ్య ఆశ్చర్యపోయాడు.

"అరె, గి వీడు యింతటోడెట్లయిండె- గీ తెలివంత యేన్నుంచి వచ్చింది వానికి" అన్నాడు.

అయిలయ్య చెవిలోంచి చుట్టతీసి నోట్లో పెట్టుకోబోతూ ఆగి 'యింత సంగం చెయ్యబట్టి జరిగింది - వాల్లొక్కటే ముచ్చట జెప్పిన్రు - 'కలిసుంటె గెలు

త్తారు' - దాంతోటి యిగ జాతి బేదం లేకుంట మాలమాదుగులు, లంబాడోల్లు, కాపులు, కమ్మర్లు అందరు గల్సింగ్రు - గంతే యింట్లున్న ముచ్చట" అన్నాడు.

"సూడబోతె శిన్న ముచ్చటే" అన్నాడు ముత్తయ్య.

"గదే మరి నంగం గొప్పదనం" అన్నాడు వెంకటేశ్వర్లు.

జనాల్లో కదలికలు మొదలయ్యాయి. కొంతమంది అటూ యిటూ శరీరాల్ని కదిలించారు. మరికొందరు చేతులు పైకెత్తి ఆవులిస్తూ ఒళ్ళు విరుచుకున్నారు. ఆపాటికి దాదాపు గూడెం మొత్తం అంతా అక్కడే వుంది. గుడ్డిదీపంలో కిరసనాయిలు అయిపోవచ్చిందేమో రెండుసార్లు భగ్ భగ్‌న మండి మరింత గుడ్డిగా వెలగసాగింది.

"యిగ లేవ్రి. శాన రాత్రయింది - మల్ల తెల్లారి పనులల్లకు బోవాలె గద" అని అయిలయ్య భార్య వీరమ్మ అన్నది.

అందరూ ఒక్కసారే లేచారు.

× × ×

ఆ పెద్ద కాంపౌండులో రెండు వ్యాన్లు, ఒక జీపూ, రెండు పెద్ద టాంకర్లూ, నాలుగైదు మోటారు సైకిళ్ళూ వున్నాయి. వాటి పక్కగా ఓ రేకులషెడ్డు కింద యాభయి అరవైమంది మొద్దుల్లాంటి మనుషులు బీడీలు కాలుస్తూ హస్కు కొడుతూ పాతటైర్లమీదా చెక్కడబ్బాల మీద ఎక్కడ వీలైతే అక్కడ కూచుని వున్నారు. మరికాస్త లోపల ఇరవై అడుగుల ఎత్తున రేకులషెడ్డొకటి వుంది. దాన్లో రెండు పెద్ద చెక్క వ్యాట్లు (Vatts) పదిహేనడుగుల ఎత్తూ ఇరవై అడుగుల వైశాల్యంతో వున్నాయి. వాటినిండా సారా వుంది. ఆ వ్యాట్లకి రెండు ఇత్తడి కుళాయిలూ వాటికి ఇనుప తాళాలూ ఉన్నాయి. వాటి తాళంచెవులు జేబులో పెట్టుకున్నాయన కాస్త ఎడంగా ఓ టేబిలు ముందు కూచుని వున్నాడు. అతనిముందు ఒక టెలిఫోనూ, దానికో తాళం, ఓ లావుపాటి కాతాపుస్తకమూ, మరో పక్కగా టేబిలుకే బిగించిన చిన్న ఇనప్పెట్టె దానికి రెండు తాళాలూ వున్నాయి. అంతేగాక అతని బుర్రలో ఏదో ఆలోచనా, పొట్టలో అరకిలో కుందేలుమాంసమూ అరసీసా విస్కీద్రవమూ ఉన్నాయి. అతడి ఒంటిమీద ఖద్దరు కమీజూ, ఆకుపచ్చ అంచున్న ఖద్దరు ధోవతీ ఉన్నాయి. ఆయన అరమోడ్పు కళ్ళతో షెడ్డు కింది మనుషుల్ని గమనిస్తున్నాడు. వాళ్ళ బూతు కూతలూ బోడి పరాచికాలూ అతనికి వినిపిస్తున్నా విననట్టే వున్నాడు.

అతడి వెనగ్గా ఒక మూలకు వరసగా ఐదుగదులు కట్టిన పెంకుటిల్లొకటి వుంది. ఐదు గదులకి ఐదు ఫాన్లూ, ఐదు మంచాలు, ఐదు బాత్రూం లెవెట్రీలూ ఉన్నాయి.

వాటి ఎదురుగా చీకటి కొట్టాంలాంటి పాతగది ఒకటి వుంది. దాన్లొ ఒళ్ళంతా చితక్కొట్టబడి శూన్యదృక్కులతో పైకప్పుకేసి చూస్తూ వెల్లకిలా అర్థనగ్నంగా పడుకున్న నలుగురు మనుషులున్నారు. వాళ్ళు లంబాడీలు. వాళ్ళని కొట్టడానికుపయోగించిన లాఠీకర్రలూ, బెల్టూ, లారీ ఇంజన్ల ఫ్యాను బెల్టులూ ఓ మూల కుప్పగా ఉన్నాయి. వాళ్ళ తాలూకు ఆడవాళ్ళు ఏడుస్తూ గేటు బయట ఉన్నారు. గేటుకి కాపలాగా ఒక కుక్కా, సింహంలాకన్పించినా విశ్వాసమున్న ఇద్దరు మనుషులూ వున్నారు.

ఆ సారాడిపో వంటగది మరీ చివర్నవుంది. అక్కడ సకల పాకరీతులు తెలిసిన మగవాడు, వాడు వండే కోడి బొచ్చు పీకటానికి ఓ ఆడమనిషీ వుంది. ఆ ఆడమనిషికి మగాళ్ళంతా బావలూ, ఆడాళ్ళంతా అక్కలూ. ప్రస్తుతం ఆమె తన కుక్క బావతో కలిసి అడవిపంది మాంసాన్ని ముక్కలు కోస్తోంది.

ఆ కాంపౌండంతా ఒక వాటికన్ సిటీలాంటి ప్రత్యేక రాజ్యం. అక్కడికి ఏ ప్రభుత్వమూ, చట్టాలూ రావు. అక్కడి రాజు సారా కాంట్రాక్టరు. అతడికి ప్రత్యేక సైన్యం, మంత్రి, రెయిడ్లు చెయ్యటమనే దండయాత్రలు నిర్వహించటానికో రెయిడ్ ఇన్‌చార్జి అనే సేనాధిపతీ, సేవకులూ అందరూ వుంటారు. వీళ్ళుగాక ఎక్సైజు పోలీసులూ, పోలీసులూ చేసే సహాయం ఎలాగూ వుండి తీరుతుంది. దొంగసారా అమ్మే వాణ్ని కోర్టులో విచారించాలంటుంది ఎక్సైజుచట్టం. సారాసర్కారులు వాణ్ని చిత్రవధచేస్తే, చంపితే ఆ చట్టానికి, దాన్ని రక్షించే వాడికీ ఏమీపట్టదు. నేరం ఆరోపించ బడ్డవాడు దోషా కాదా అనేది నిర్ణయించేది చట్టం కాదు. సారా సర్కారులే. వాడు దోషి కానప్పటికీ!

× × ×

సారాడిపో గేట్లు భళ్ళున తెరుచుకున్నాయి. ఎర్రరంగు మోటారు సైకిలొకటి కొంపలు మునిగినట్టు అరుస్తూ వచ్చి ఆగింది. దాని పై నించి ఒంటె ఎత్తూ పంది బలుపూ వున్న మనిషొకడు దూకాడు. స్టాండు వేసి దూకుడుగా వ్యాట్లు ఉన్న షెడ్డు దగ్గరికి నడిచాడు.

532

అక్కడ టేబిలు ముందు కూచున్న మనిషి "అయ్యగారొచ్చేరు ఇంచే పణ్ణెండి ఎటెళ్ళావ్ ?" అన్నాడు అతన్నిచూస్తూ. వచ్చినతడు శాంతారావు. అతడు ఆ డిపోలో కాస్తంత వాటాకియజమాని. అతనింతకుముందు ఇంకో సారాకాంట్రాక్టరు దగ్గర పనిజేసిన రోజుల్లో అతనినెత్తిన చెయ్యి పెట్టి సంపాదించిన డబ్బుతో దీన్లో భాగస్వామి అయాడు. ఇంకా ఎంతో పైకి ఎదగాలని అతడి ఆశ.

అందుకని "ఏరీ అయ్యగారెక్కడా ?" అన్నాడు.

"అదో, ఆ మూడో నెంబర్రూంలో వున్నారు" అన్నాడు టేబిలు దగ్గరి మనిషి.

శాంతారావు మూడోనెంబరు రూండగ్గరికి దూసుకుపోయాడు. తలుపులువేసి వున్నాయి. మెల్లిగా తట్టాడు.

"ఎవడ్రా నా కొడుకు ?" లోపల్నించి గర్జన వినిపించింది.

"నేనండయ్యా, శాంతారావుని ?"

"నువ్వాట్రా ! లోపలికి రా ముందు"

శాంతారావు తలుపు తోసుకుని గదిలోకి తొంగిచూశాడు. గదిలో చిన్న జింక పిల్లని పక్కన కూచోపెట్టుకుని నిమురుతూ విస్కీతాగుతూ కూచున్న చిన్న బ్బాయి కన్పించాడు.

"దండాలండయ్యా !" శాంతారావునమస్కరించాడు.

"దా, దా ! ఏట్నీకత ? ఏందీయవారం ? నీకోసం రెండు గంటల్నించి సూత్తన్నాన్రారే. డిపోనడిపేదా మానేదా ?" అన్నాడు చిన్నబ్బాయి. శంఖుమార్కు లుంగీ, కట్ బనీనూ వేసుకుని ఉన్నాడు.

"అయ్, మీరలాగంటే ఎలాగండే ! నేను మన యవారం మీదే తిరుగుతున్నా. అయ్ బాబయ్ బాబు ! ఏటండీ ఈడు ? పెట్రేగి పోతున్నాడు. మనకి ముప్పు తెచ్చేత్తన్నాడు" అన్నాడు శాంతారావు.

"ఎవుడా కొడుకు ?"

"ఆడేనండి గిరిబూశనం గాడు ! ఆడమ్మా శిగదరిగిన పార్టీ అదేదో నక్సలైట్నాకొడుకుల పార్టీ లోజేరి తెగ శికాకు పెట్టేత్తన్నాడండి !"

"ఎవుడా గిరిభూషణం ?"

"అహ, తమరికి తెల్దు గదండీ . ఇక్కడొాగుడు ఉన్నాడండి. ఆదే గిరి భూషణమండి ! ఆడు యమాడేంజరస్సండి ! బంజార్నాకొడుకుల్ని కూడదీసి తెగల్లరి పెట్టేత్తన్నాడండి. రెయిడ్లు సెయ్యబోతె ఆడు ఆల్లందరితోగూడి అడ్డుగొట్టున్నాడండి ఆడో పెద్ద కేట్నాకొడుకండి ! ఆడి మాటందరూ ఇంటారండి, అదే మా పెద్ద శిక్కండి !" శాంతారావు చెపుతూంటే చిన్నబ్బాయి జింకపిల్లకి మాంసంముక్కలు, జీడి పప్పులూ అందిస్తూన్నాడు. జింకపిల్ల జీడిపప్పులు మాత్రమే తింటూ తన ఆటలు తాను ఆడుకుంటోంది.

"ఓరి ఎర్రినాయాలా ! ఏట్రా ఇందాకన్నావు ? ఆడు కేట్నాకొడుకా ? నువ్విలగాలోచిత్తన్నావు గాబట్టే ఆడు పెరిగిపోతన్నాడు. ఆడిమాట ఇనే జనంవుండా రంటే ఏమన్న మాటా ! ఆడో లీడరన్నమాట ! అంటే ఆడికో పార్టీ వుందన్న మాట ! ఆ పారిటీగూడ బీదోల్ల పార్టీ అన్నమాట ! కాబట్టి ఏటి జరుగుతుందీ డబ్బు నోడిమీదికి ఆడుకూల్నాయాలందర్నీ ఎగదోత్తన్నాడన్నమాట! అంటేడబ్బునోల్లంత ఆడికి శత్రువులేగదా ! మరి ఆడి శత్రువులంతా మనమిత్రులేగదా ! డబ్బునోడు డబ్బునోడు కలిస్తే కానిదేముంది ? ఈః రూట్లో నీ ఆలోశనెందుకు పోలేదో ?"

"కాని బాబూ ! ఆడిదగ్గర తుపాకీలు, బాంబూలూ, జనం వున్నారండి" శాంతారావు చెప్పాడు.

"ఓరి ఓరి ఎర్రి పీనుగా ! తుపాకీలు మనకిలేవా ?" చిన్నబ్బాయి ప్రశ్నించాడు.

"ఏడండి ? ఏడున్నాయి ?"-

"లుచ్ఛానాయాల. నీకుయవారం నడపడం శాతవుట్రా నాకొడకా ? నీలాంటోళ్ళని నమ్ముకుంటే నేనూ నా సిండికేటూ కుడ్సిపోవాల్సిందేరా దేకార్నా కొడకా ! నీకొాగిచే నేనిచ్చే ఇంటు. ఎవడైతే మనశత్తురువో అడి శత్తురులంతా మన మిత్తుర్లే -. ఇదీ సూత్తరం. ఇది గాక మనకీ కాత్తె దగిర్నం, తెగింపూ ఉండాల. అలకాప్పొతే సేయించే తెలివన్నా వుండాల. లేదంటే మన్నుగొట్టుకు పోడమే" అని ఆగి కాస్త విస్కీ చప్పరించి "మనకెంత దగిర్యముండాలంటే దానికో ఉదాహరణ యిను....

నేనో పాలి ఇలగే సారాడిపోయవారాలు సూ త్తన్నా- అంటే నీలెపల్లో ఉన్నాన్నమాటప్పుడు ! సరిగది జరిగింతర్వాత కోయనాయాల్లు నా యేరియాలో సారా కాత్తున్నారని తెలిసి 'రైడు' కెలదామనుకున్నా. ఇంతలోకే డిపోలో జనాల్లెవరూ లేకుండయూరు. ఆలంటా యేరేరయిడ్ల కెల్లేతలికి నాకు వోర్సు లేకుంటయింది. కోయ నాయాల్లు సారాకా త్తన్నారని ఇన్ఫరమేసనొచ్చేత ఊకోటం - ఏటి ?- ఊకోటం - పరువుదక్కువ పనని నా ఎర్ర ఎన్ఫెల్డు బండెక్కి ఇరవై మైళ్ళదూరాన ఉన్న గూడేనికి దూకిచ్చా బండి.

నేనా గూడానికి ఐయల్దేరే తలికి నా దగ్గిరో పిస్తోలు రెండు లీటర్ల పెట్రోలూ తప్ప మరేం లేవు. ఆకరికి నా కార్మినారు సిగురెట్లనీ వదిలి పరుగెత్తినానన్నమాట.

సరి— యెల్లేతలికి గూడెం మద్దెన ఓపెద్దకుండలో సారాయెట్టుకుని సుట్టూ కోయ నా కొడుకులూ, గుంటముండలూ యెగుర్తూ డాన్సు సేత్తుంటే ఓ నా కొడుకు అలందరికీ గళాసుతో సారాముంచి పో త్తన్నాడు. అది ఆల పండుగే అవచ్చుగాక. కానీ ఆల సారా తాగటానికి ఆలెవ్వరోంట ? గవుర్మెంట్నాకొడుకు ఈ యేరియాలో ఈ డిపో సారాతప్ప తాగ్గూడదన్చెప్పిన తర్వాత ఎవుడి సారా ఆడే తాగితే యేమిటర్థం? సట్టధిక్కారం. అదిగది గుర్తొచ్చి నా యెన్ఫేల్డ్ బండితో ఆ సారాకుండని ఏక్దమ్మున గుద్దేశానంతే. ఎక్కడ్డాన్సులక్కడే ఆగిపోనాయి. ఎక్కడ్నాకొడుకులూ, ముండలూ అక్కడేఆగి మిటకరించి సూ త్తన్నారంతే. పిస్తోలు తీసి 'ఢాం'మనిపించి-

'ఒరే నాయాల్లారా ! సక్కా లొంగిపోండి. లేదో మీ యమ్మ శిగతరుగుతానంతే' అన్నా—

ఒక్కసారి చూశారంతే మిటకరించి. తర్వాత జొయ్యిమని మగోళ్ళంతా నా మీదబడి దుమ్ములేపేశారనుకో, తలబద్దలైంది. కాళ్ళూ, ఒళ్ళూ చీరుకుపోయి రగతం- దానెమ్మా- రగతం కారుతోంటే ఎగిరి బండిమీద్దూకి స్టార్టు చేసి గేర్లు అడుగు దాకా తొక్కి క్లచ్చొదిలా. బండినడిపిన అర్ధగంటసేపూ బ్రేకుమీద కాలెయ్యలా. ఆక్సిలేటరు లూజొదిలిపెట్టలా.

డిపోజేరింతర్వాత సూస్కుంటే ఏటుంది. ఒంటిమీద పంచె ఏడబోయిందో కన్రాయరూ. చింపుల లాల్చి వున్నాయి. యెంటనే యెల్లి అమట్టున అ గ్లాసు విస్కీదంచా !

ఇంతలో రైడింగు పార్టీ జవాన్లు వ్యాన్నిండా బిలబిలామని దిగారు. ఆల్లెంట ఎవురో దొంగసారా నాయాల్లున్నారు. అల్ల డన్లప్ షైరు ముక్కల్తో కసి దీరాబాదేశా."

అని చిన్నబ్బాయి ఓ విస్కీ గుటకేశాడు.

ఈ లోపల శాంతారావ్ ప్రశ్నవేశాడు.

"రైడింగు పార్టీ రాంగానే ఆ మట్టున మీరా గూడెంమీదికెందుకు పోలేదండి?" చిన్నబ్బాయి గ్లాసుని దభీమని టేబిల్‌మీద వదిలి "శ్చ! ఎంత ఎర్రి ఎదవైనా అలా పోత్రాడ్రా? అప్పుడేటి జరిగింది? ఆలగూడెం మీదికి ఎల్లి దొమ్మి సేసొచ్చా. అప్పుడొగుణ్ణె ఉన్నా గనక మళ్లీ ఎల్లి మంచీ మార్బలం పట్టుకొత్తానని అల్లకి తెలీదా? అందుకోసం ఏటన్నా జరిగితే కాసుకోటానికి అలు రెడీగుండరా? అటువంటి టయంలో గూడెం మీదికి పోతే మన పని కాళీ అవుద్ది. అంచాత మర్రెంద్రోజుల్దాకా అణోలి కెల్లలా. తరవాతేం జరగాలో అజ్జరిగిందనుకో. ఇంతకీ ఈ కతలో నీతి ఏటంటే మన యెంట సపోర్టున్నా లేకపోయినా అన్యాయం జరుగుతుందని తెల్సిన యెంటనే సొరవతో దూకే దగిర్యం- శావ వుండాలన్నమాట. అది లేకపోతే మనం ఈ యాపారాలా శెయ్యడాన్కి పనికిరావన్న మాట!"

మళ్ళీ ఓ గుటకేసి చిన్నబ్బాయి ఇలా అన్నాడు.

"ఒరే బుడ్డనాయాలా! మనం జేసేదేటి? యాపారం— ఐతే దీనికి యాపారంలా కనిపించే లచ్చనం లేదు. దీనికి అన్నియాపారాల్లాగా డబ్బు పెట్టుబడి కన్న తెగువుండాల. అది లేప్పోతే ఎంతడబ్బుండీ లాబంలేదు. అసలు బిజినెస్సంటే ఏట్రా? ఎవుడి బలయీనత ఏదో దాని మీద యాపారం జెయ్యటం. అయితే సీర్లమ్మేవోడూ సిగిరెట్లమ్మేవోడూ గూడా బిజినెస్సే సేత్తన్నారు. కానీ మన్లాగా ఆడికి జనంతో తకరారు లేదు. ఏక్లాసు సిగిరెట్లోడికీ లోక్లాసు సిగిరెట్లోడికీ మద్దిన సట్టబద్దమైన పోటీ! ఆడికీ లైసెన్సుంది ఈడికీ లైసెన్సుంది. కానీ మన్దేటి? ఒక్క బ్రాండు వస్తువే. దీనికి పోటీ ఏటి? దొంగసారా! దానికి లైసెన్సు లేదు. మనకుంది. మనకు లైసెన్సుందంటే ఏటన్నమాట? సట్టం, న్యాయం, పోలీసులు, కోర్టు, ఆఫీసర్లు ఇయ్యన్నీ మనకు అతికారాలిచ్చి ఈ యేరియాలో సారా అమ్ముకోండ్రా అన్నారన్నమాట! దీనికి బదులు మనం ప్రెబుత్వానికి సాలుకి పది లక్షలు అంటే రోజుకి దగ్గిరగ్గిర మూడువేలరూపాయలు ఇత్తన్నామన్న మాట. ఏటి? ఇంటన్నావా?"

చిన్నబ్బాయి గద్దింపుకి శాంతారావు ఉలిక్కిపడి "అయ్ బాబు, ఎంతమాటండే తమరు జెప్పేదినక పోడమే ?" అని చిన్నబ్బాయి ముందున్న ప్లేటుని గమనించి గుమ్మం దగ్గరికి గంతేసి

"ఒరే నాయుడూ, ఓరి వంటల్నాయుడూ, అనికేకేశాడు. వంటల్నాయుడు భూమిలోంచి పుట్టినట్టు ఎదురుగా క్షణంలో నిలిచాడు.

"అయ్‌గారికి మావసం తేరా ! గొర్రెమొకం నాయాలా" అని గద్దించి పళ్లెం అందించాడు. వంటల్నాయుడు ఆ పళ్లెమందుకుని పరిగెత్తినట్టెళ్ళిపోయాడు.

శాంతారావు మళ్ళీ చిన్నబ్బాయి ముందునించుని వినయంగా చేతులు వెనక్కికట్టుకుని "అయ్", అన్నాడు.

చిన్నబ్బాయి జింకపిల్ల తలమీంచి మెడమీదిదాకా నిమురుతూ "ఇందా కేమిట్రా అన్నాను ? మనం గవుర్మెంటు కెంతిస్తున్నాం ? ఆ..... రోజుకి దగ్గిర గ్గిర మూడేల రూపాయిలు - అడికీ ఈడికీ ఇచ్చే మామూళ్లు మరో వెయ్యి రూపా యిలు పోగా మన డిపో మెయింటెనెన్సుకి ఇంకో మూడేల రూపాయిలా మొత్తం ఏడు వేలరూపాయిల ఖర్చుపోగా మనకి అంతో ఇంతో మిగలాలి. ఏటి నేజెప్పేది సత్తెవా ? కాదా ?" అన్నాడు.

శాంతారావు ముక్కుమీద వేలేసుకుని నాలికని రెండు వరసల పళ్ళ మధ్య ఇరికించి 'ఎంతమాట !' అన్నట్టు తలాడించాడు. ఈలోగా వంటల్నాయుడు పళ్లెంలో మాంసం ఫ్రై ముక్కల్ని తెచ్చి టేబిలుమీద వుంచి వెళ్ళాడు. చిన్నబ్బాయి రెండు ముక్కలు నమిలి ఓ గుక్క చప్పరించి సిగరెటు అంటించాడు.

"అవునా ? ఇప్పుణ్ణీకు 'ప్లాటుస్టిక్కు' జెప్తానిను. ఎల్లి ఓ కాయితం కలం అట్టుకురా" అన్నాడు చిన్నబ్బాయి.

శాంతారావు తలూపి షెడ్డు కిందికి వచ్చాడు. అక్కడ వున్నతన్ని అడిగి కాగితం, బాల్‌పెన్నూ తీసుకుని మళ్ళీ వచ్చాడు. లోపలికి రాబోయి మళ్ళీవెనక్కెళ్ళి ఓ సిగరెటు అంటించి గబగబా నాలుగు పీల్పులు పీల్చాడు.

పక్కనే వున్న 'లాకప్' రూంకేసి చూశాడు. దాన్లో వున్న లంబాడాల్ని వుద్దేశించి

"ఏరా నాయాల్లారా ! మీ తరుపు వాళ్లెవురూ ఫైను కట్టడానికి రాలేదా ఇంకా ?" అన్నాడు.

"గన్నిపై సలు మాదగ్గరెక్కడియిదొరా ?" అన్నాడొకడు.

"అసలు పైను గట్టుడేంది ? పంపుతె జేలుకు పంపుంద్రి" అన్నాడు మరోడు.

ఒకడు తుప్పున ఉమ్మాడు.

శాంతారావుకి కోపం పొంగుకొచ్చింది. సిగరెట్టుని గబగబా పీల్చి కాలి కిందపడేసి నలిపాడు కోపంగా. విసురుగా నడుస్తూ చిన్నబ్బాయి గదిలోకి వెళ్ళాడు.

కళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తున్న చిన్నబ్బాయి అడుగుల చప్పుడికి కళ్ళుతెరిచి "వచ్చేవా ? అం ఇలకూర్కో ?" అని స్టూలుచూపించేడు. శాంతారావు ఆ స్టూలుమీద నిలబడ్డట్టే కూచున్నాడు.

"అసలు మన యాపారం ఏటంటే శానాగొప్పదన్నమాట. దీన్లోవి కీలకం ఎవుడికీ అసలంతు పట్టదు. పౌడర్లూ, స్నోలు యాపారం జేసేవోడు తన వాస్తువుని మడిసి సెర్మం మీదికి మాత్తరం పంపగల్డు. సినిమాస్టార్లయినా, శ్రోతలు ముండ్లయినా అనుబగించినంత సేపేగానీ తర్వాత మర్చిపోతాం. ఎన్ని సుఖాలయినా అనుబగించినప్పుడే ఆనందం. తర్వాతేం మిగల్దు. కానీ మనసాదావుందే - రగతంలో రగతంలా కల్సిపోయి ఆడినెత్తురు గొట్టాల్లో పారుద్ది. ఆడి శరీరమంతా పాకిపోద్ది. గుండెకి తాకుద్ది, మెదడు కెక్కుద్ది. కళ్ళూ సెవులూ నాలికా మొత్తం సెరీరమే దాని కంట్రోల్లోకి వొచ్చేత్తది. అంటే ఏటన్నమాటా ? మనయాపారంమొత్తం మడుసులందర్నీ మన కంట్రోల్లో ఉంచే యాపారమన్నమాట ! స్నోలు, సిల్కుగుడ్డలు, నగిషీ చెప్పులు వద్దనుకుంటే కొనకుండా వుండగలరు గానీ సారా వద్దనుకుని ఉండేవోడు అసల్లేడు. అంచేత ? మనం మనవస్తువుని మనిషిలోపలికి ఆడిమాంసకణాల్లోకి గూడా పంపుతాంగదా మరి ! అంచేత ఒరే, ఇలాంటి యాపారాన్ని ఎక్కడైనా సూసేవురా ?" చిన్నబ్బాయి అడిగాడు.

"ఇంతవరకూ మీరుజెప్పేదాకా ఇంత గోల వుందని తెలీదండే !" శాంతారావు బుర్రగోక్కున్నాడు.

"మీ వెదవ మొకాలకి ఇంత తెలివుంటే ఇలాగెందుకుంటారు ? సర్లే. నీకిప్పుడు "స్టాటుస్టిక్సు" జెప్పుతానన్నాగదూ !" అని ఓ క్షణం ఆగి విస్పష్టప్ప రించి సిగరెటు అంటించాడు చిన్నబ్బాయి. రెండు నిమిషాలు ఆలోచించి

"ఇప్పుడు మనం మావఁలా తీసుకున్న యేరియాలో జనాభా ఎంత ?" అనడిగాడు.

శాంతారావు బుర్ర గోక్కున్నాడు.

"తెలీదండీ" అన్నాడు నెమ్మదిగా భయంగా.

"ఏం తెలివిరానీది జోడిముండా నాయాల. నీ యేరియాలో జనవేఁ నీకు తెలీక పోతే నీ యాపారం సంగతేం తెలుస్తుంది ? యవారం సంగతేం తెలుస్తుంది ? ఇలగైతే అడుక్కు తినిపోతావురొరే !" అని చివాట్లేశాడు చిన్నబ్బాయి.

శాంతారావు మాట్లాడలేదు. "సరి. కాయితం మీద రాస్కో. మన యేరియాలో జనాబా మూడులచ్చలమంది." చెప్పాడు చిన్నబ్బాయి. శాంతారావు రాసుకున్నాడు.

"దాన్లో తాగనినాకొడుకులా, ముసిలీ, ముతకా అందర్నీ కలిపి యాభై ఏలమందిని తీసెయ్ "

శాంతారావు తీసేశాడు.

"ఆడముండల్నీ పిల్లల్నీ కలిపి లచ్చమందినీ, బ్రాంఢీ, విస్కీమాత్తరమే తాగే నాయాల్లనీ, కల్లుదాగే దేకూఫ్ యెదవల్నీ మరో యాభై ఏలమందిని తీసెయ్."

శాంతారావు ఆపని చేశాడు

"మనకి మిగిలిందెవరూ ? లచ్చమంది సచ్చు పీనుగులు. మళ్లీ ఈ నా కొడుకుల్లో రోజూ తాగేవోల్లూ, ఎప్పుడన్నా తాగేవోల్లు అని రెండ్రకాలువుంటారు. ఏటి అవునా ?"

"అవునండి"

"రోజూ తాగేవోల్లు యాభై ఏలమందనుకో. ఈల్లు మన రెగ్యులర్ కష్టమర్లన్నమాట. ఆల బలయీనత మీదే మన యాపారం. మనదేటి ? అసలేయాపారమైనా మడుసుల బలయీనతమీదే నడుసుద్ది. సరి. ఈ మందిలో మళ్లీ సిక్కుంది."

"ఏటండే ? !"

"ఈలల్లో రోజూ వందగ్రాములు రెండొందలు ఐదొందలు తాగే వోలుంటారు. కాబట్టి మనం సగట్న ఒక్కొక్కడికి రెండొందల గ్రాముల లెక్కేసుకోవాలి" చిన్నబ్బాయి చెప్పిన అంకెని శాంతారావు కాయితంమీదరాశాడు.

"సగటున ఒక్కోడు రెండొందల గ్రాములు తాగితే యాభైవేలమందికి పదేల లీటర్ల సారా రోజుకి కావాలన్నమాట. ఏటి ? అంతేనా ?"

"అంతేనండి" శాంతారావు తలాడించాడు.

చిన్నబ్బాయి చిన్నగానవ్వి

"ఈ పదేల లీటర్లూ మనం లీటరు అర్రూపాయల సొప్పున గవర్మెంటు డిపోలో కొంటాం. ఎంతవుద్ది ? అరవై ఏలరూపాయలు. దాని ట్రాన్స్‌పోర్టేషను కర్సు మరో రెండేలు. మొత్తం అరవై రెండేల రూపాయిలకర్సు. ఔనా ! రాస్కో మరి—."

శాంతారావు రాశాడు.

"ఈ అరవై రెండేలకి మన రోజువారీ కర్సులు ఏడేలు కలుపు. మొత్తం ఎంతయిందీ ?"

"అరవై తొమ్మిదివేలండి !" శాంతారావు చెప్పేడు.

"మరిగ మనం లీటరు ఎంతకమ్ముతాం ?"

"ఇరవై రూపాయిలకండీ !"

"అంటే పదేల లీటర్లకి ఎంతన్నమాటా ?"

శాంతారావులెక్కేశాడు. మొత్తంరెండు లక్షలు. రోజుకి రెండు లక్షలు !

"పదివేల లీటర్లకి రెండు లక్షలవుతుందండే !"

చిన్నబ్బాయి నవ్వాడు.

"ఆ రెండు లక్షల్లోంచీ మనకర్సులు అరవై తొమ్మిదేలు తీసేయి"

శాంతారావు తీసేశాడు.

"లక్షా ముప్పయ్యొక వేయి మిగిలిందండి"

"దాంట్లో మన ఏజంట్ల కమీషనుపోగా మనకి నికరాదాయం లక్ష రూపాయలు. ఓరి సచ్చుమొగం నాయాలా ! ఇను మన డిపోకి రోజుకి లక్షరూపాయిల నికరాదాయం !"

540

చిన్నబ్బాయి విస్కీగ్లాసుని అమాంతం ఎత్తితాగి గట్టిగా నవ్వాడు.

శాంతారావు గుండె ఆగిపోయినట్టయింది. ఇదంతా నిజమేనా? రోజుకి లక్ష రూపాయల ఆదాయం ఏ వ్యాపారంలోనైనా ఉంటుందా? ఒకవేళ దీన్లో సగం, అంతెందుకు పావువంతు చూసుకున్నా రోజుకి పాతికవేల ఆదాయం ఎటో పోదుగదా! అతడు విభ్రమం నుంచి తేరుకోకముందే చిన్నబ్బాయి అన్నాడు.

"కలగంటన్నావేట్రా? ఓరి ఓరి నా కొడకా! ఎంత లాభం లేనిదే దేశం వొదిలి పెల్లాం బిడ్డల్నొదిలి ఈ పరప్రాంతం వొచ్చి ఇన్ని కష్టాలు పడతామనుకున్నావురా! రోజుకి లక్ష రూపాయిల లాభం అంటే పైసా వాటాగాడికి వెయ్య రూపాయలు రోజు వాటా లాభం అన్నమాట. అంటే ఏటీ? ఇంటన్నావురా శింత మొద్దునాయాలా! నీ వాటా లాభం రోజుకి యెయ్యరూపాయిలు"

శాంతారావు అవాక్కయిపోయాడు. సంవత్సరం పేరుమీద రెండో మూడో లక్షలు తీసుకోడమే గానీ ఈ లెక్కలు ఇవన్నీ తాను చూసుకోలే దెన్నడూ. అయితే పావలా వాటా వున్న చిన్నబ్బాయి కెంత ఆదాయం వుందో? ఇంత ఆదాయం వుండే వ్యాపారం ఇంకేదీలేదు. కాకపోతే కాస్త రిస్కు.

శాంతారావు ఆలోచిస్తుండగానే చిన్నబ్బాయి గ్లాసు ఖాళీ చేసి మళ్ళి నింపుకుని

"ఏట్రారే ఆలోచిస్తన్నావు! నీ ఆలోచన కట్టిపెట్టు. నే జెప్పేది ఇను. దీన్లొ ఎంత లాబం వుందో జెప్పాగదా! ఈ లాబానికి అడ్డొచ్చేవోల్లూ వుంటారు. ఆలే దొంగసారా నాయాల్లు. ఆలవల్లే మన జాతకం తిరగబడిపోద్ది. అంచేత ఆల్లవల్ల మన కెంత నష్టవోఁ మేరే జెప్పాల్సిందేవీఁలేదు. అవుసరమైతే మడుసుల్ని ఎగర దీసేడవేఁ"

"దొంగసారా అంటే ఇంకో చిక్కుందండి. కోయనాయాల్లు, లంబాడి నా కొడుకులు ఆల సారా ఆల్లే కాసుకుతాగుతారండి. ఆ గూడేలలో మన సారా అవుసరమే పడదుగదా! అదెలాగండి?"

"ఆల్ల సారా ఆల్లు తాగడవేఁ గాక ఇతర్లకీ అమ్ముతున్నారని కేసు పెట్టడవేఁ. తెచ్చి బొక్కలో దోసి ఫైను వసూలు జెయ్యటమేః" చిన్నబ్బాయి వివరించాడు.

"ఆఁ. నేనాపన్జేస్తుంటేనే ఈ గిరిబూశనంగాడు అడ్డు దగిలి నన్ను మట్టికరిపిత్తున్నాడండి" శాంతారావు చెప్పాడు.

"ఏటంటాడు ఆడు ?"

"ఆడేటీ అనడండి. మన డూటీ మనం జేస్కోకుండా చెయ్యడమే ఆడి పని. ఆడి పారిటీ ఏదో వుంది. దాంతో తెగ రేగిపోతున్నాడండి"

చిన్నబ్బాయి పెదాలు ఓసారి బిగించి వదిలి "పార్టీ కేమన్నా సందా లిత్తా ననలేక పొయ్యావా ?" అన్నాడు.

"అయ్‌బాబు, నా కంతమాత్తరం తెలీదండీ! కాని ఆడిది సందాలపారిటీ గాదండి, ఆ మాటంటే నాలిగ్గోత్తాడని జనం జెప్పారండి"

"మరాణ్ని ఏటి సెయడం ?" చిన్నబ్బాయి సాలోచనగా అన్నాడు.

"మనవేం జెయ్యక్కర్లేదండి. మొన్నో పారిటీలో ఎస్సై మనోడొగుడు గల్సి కుశల మడిగాడండి. అడికీ ఈడి కతంతా జెప్పానండి. ఈడు నక్సలైటోడు గదా. ఎన్‌కౌంటర్ లిస్టులో ఆడి పేరుందటండి. ఆడు కన్పిత్తే ఇగ కాల్సీడవేఁ ఆలీసెం" శాంతారావు వివరించాడు.

"అలాగా ! అంతేలే మన చీఫ్ మినిష్టరుగూడా తుపాకిని తుపాకితో ఎదురుదెబ్బ దీత్తానని ఈ మద్దినేగా అన్నాడూ! గౌర్మెంటు సొరవతో పని జరిగి పోద్దిలే. ప్రమోషన్ల ఆశతో ఎస్సై నాకొడుకులు కొల్లబీకేలా తిరిగైనా ఆడి జాడ కనుక్కొని కాల్చిపారేత్తారు!" ఈ మాటలు అని చిన్నబ్బాయి ఏదో గుర్తొచ్చినట్టు.

"మరిదీన్లొ మన యేలున్నట్టు తెలీగూడదురోరే! ఎవుడిమీదో తోసెయ్యాల! గౌర్మెంటు పూనుకున్నప్పుడు మనం బయట పడటం మంచిదిగాదు" అని ఏదో ఆలోచిస్తూ చిన్నబ్బాయి ఊరికే ఉండిపోయాడు. గ్లాసుడు విస్కీ అమాంతంగా తాగేడు.

నిమిషం, ....

రెండూ, మూడూ, పదీ ....

పావుగంటయింది.

ఎడం శాత్తో జింకపిల్ల మెడని నిమురుతూ ఉండిపోయాడు చిన్నబ్బాయి.

"ఈ విషయంలో ఏం జెయ్యమని తమరి సలా?" శాంతారావు అడిగేడు.

చిన్నబ్బాయి ఒక్క విసుర్న లేచేడు. అతడి ఎడం చేతిలో జింక పిల్ల మెడ వుంది. కుడిచేయి పిడికిలి బిగించి శాంతారావుని దవడమీద గుద్దేడు.

542

"లంజా కొడకా! తత్తవశాస్త్రం జెప్పొగ్గూడా ఎగ్రిగ్రెశ్న లేత్తావేరా పేకార్నా కొడకా!"

శాంతారావు దిమ్మెరపోయాడు.

చిన్నబ్బాయి ఉగ్రరూపం దాల్చాడు. అతడి కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి, పిడికిళ్ళు బిగుసుకున్నాయి. ఎడమచేతి పిడికిలిలోవున్న జింకపిల్ల ఊపిరాడక గిజగిజలాడి చచ్చిపోయింది.

చిన్నబ్బాయి జింకపిల్ల శవాన్ని మూలకి విసిరాడు,

"ఫో! లంజా కొడకా! తేరగా ఉందని తిని తాగడం, అవసరమైన డబ్బు అంకించుకోడం తప్ప ఏం తెలీదు నాయాళ్ళకి! నీ యమ్మా మొగుడిదా లేప్పోతే నీ పెళ్ళాం మొగుడిదా ఎవుడిదనుకున్నారా సొమ్ము? సోవింబక్తి లేదు, యిశవాసం లేదు ........"

చిన్నబ్బాయి ఇంకా ఎన్ని తిట్టేవాడో గానీ గుమ్మంలో గులాంఖాన్ ప్రత్యక్షమయాడు. గదిలో అడుగుపెట్టిన గులాంఖాన్ శాంతారావునీ, మూలకి చచ్చి పడున్న జింకపిల్లనీ, చిన్నబ్బాయినీ చూసి జంకి వెనక్కి తిరగబోయాడు.

చిన్నబ్బాయి పిలిచాడు. "ఏట్రా! ఎలిపోతన్నావు?"

"అబ్బే.... ఏం లేదండి. రాగూడని టయాంలో వచ్చేనేమోనని...." నసిగాడు గులాంఖాన్.

గులాంఖాన్ వచ్చాడంటే వాడితోపాటు ఎవర్తో గుంటముండ వచ్చిందన్న మాటే అనుకుని శాంతారావు గుమ్మం దాటాడు. అతడు గుమ్మం దిగుతుంటే నీడలో వున్న ఎస్తర్ కన్పించింది.

"ఓ, నువ్వేనా?" అన్నాడు శాంతారావు.

"ఆఁ. మరే!" అని నవ్వింది ఎస్తర్. ఆమె రెడ్డి క్రైస్తవురాలనని చెప్పుకుంటుంది. హరిజన క్రైస్తవుల్ని దగ్గరికి రానీదు.

ఆమె మెల్లెక్కుతుంటే ఆమె హొయలునీ, సొగసుల్ని చూసి శాంతారావు వేడెక్కిపోయాడు. ఆ పట్టున వెళ్ళి లాకప్‌రూంలో లైటు వేశాడు.

నిద్రపోతున్న లంబాడాలు ఉలిక్కిపడి లేచారు. చిన్నబ్బాయిమీద కోపమూ, తనకు దక్కని ఎస్తర్ అందమూ హృదయాన్ని రగిలిస్తుండగా పైరుబెల్టుని చేతిలోకి తీసుకున్నాడు శాంతారావు.

ఆ రాత్రంతా లంబాడాల రోదనలతో డిపో ప్రతిధ్వనించింది.

× × ×

తండాలోని ముప్పై గుడిసెల్లో అదో మూలగుడిసె.

లోపల గిరిభూషణం కూచుని వున్నాడు. అతని ముందు మరో ఇద్దరు మనుషులు కూచుని మాట్లాడుతున్నారు.

గిరిభూషణం బనీనూ, లుంగీ వేసుకుని వున్నాడు. మనిషి కాస్త విశ్రాంతిగా కూచుని ఎదుట వున్నవాళ్ళు చెప్పేది వింటూ తగిన సమాధానాలు ఇస్తూన్నాడు.

మధ్యాహ్న సమయం. రెండుగంటలు కాలేదు. బయట ఎండ నిప్పులు చెరుగుతోంది. ఏప్రిల్ సూర్యుడు తండామీదే ఆగి కదలటంలేదు. గాలి గూడా స్తంభించిపోయింది.

ఒక స్త్రీ గుడిసె లోపలికి వచ్చింది. "నీ కోసం ఎవలో వచ్చిన్రు" అందామె.

గిరిభూషణం తలతిప్పి "ఎవరు ?" అన్నాడు.

"ముగ్గురు ఆడోళ్ళు ఇక్కడోళ్లే."

"ఏం పనట ?"

"ఏమో చెప్పలే గని ఇంటి పంచాయితులు చెప్పుకుంటరేమొ ?" అందామె.

కళ్ళకున్న అద్దాలు తీసి ముఖంమీది చెమట తుడుచుకుని "మంచిది. మాట్లాడుతున్నగద. కాసేపు బయట కూచోమను" అన్నాడు గిరిభూషణం. అతడి వయసు పాతికనుంచి ముప్పైలోపు వుంటుంది. కోరమీసాలున్నాయి. ఆ ప్రాంతంలో ప్రజలకి అతడు కొండంత అండ. అత్తాకోడళ్ళ తగువుల్నించి భూస్వాములు చేసే దౌర్జన్యాల దాకా అతడు తీర్పు చెప్పాల్సిందే.

అరగంట గడిచింది. గుడిసెలోపల మాట్లాడుతున్నవారి మాటలు తెమలడంలేదు. ఇంతకు ముందు వచ్చిన స్త్రీ మళ్ళీ గుడిసెలోకి తొంగిచూసింది. గిరిభూషణం ఎదురుగా వున్నవాళ్ళకి ఏదో వివరిస్తున్నాడు. అతడు మాట్లాడేదంతా వాళ్ళు శ్రద్ధగా వింటున్నారు. వాళ్ళని మధ్యలో పలకరించటం దేనికని ఆమె మళ్ళీ బయటికి పోయింది.

గుడిసె బయట ఎండ చిట చిట లాడుతూ వుంది. ఎండలో ఉండటం కష్టమనిపించి చూరువారన నిలబడిందామె. ఎదురుగా వేపచెట్టుకింద ముగ్గురు స్త్రీలు కూచుని వున్నారు. వాళ్ళు తమలో తామే ఏదో మాట్లాడుకుంటూ కూచున్నారు. మరీ వయస్సు తక్కువగా ఉన్న స్త్రీ కోడలు కాబోలు వృద్ధురాల్ని కొరకొరా చూస్తోంది.

ఆకు గూడా కదలటం లేదు: సూర్యుడు తండామీది నుంచి కదలడం ఇష్టంలేని వాడిలాగ మెల్లిగా పడమటికి కదులుతున్నాడు.

× × ×

తండాకు రెండు ' ఫర్లాంగుల దూరంలో ఓ చెట్టుకింద జీపు ఆగింది. దాన్నిండా కిక్కిరిసిట్టు మనుషులున్నారు. వాళ్ళు అంటీ నక్సలైట్స్ స్క్వాడ్‌వాళ్ళు. వాళ్ళలో కొందరు ప్యాంట్లు విప్పి లుంగీలు వేసుకున్నారు. మొలలో రివాల్వర్లు దోపుకున్నారు, చేతుల్లో రెండు పొట్టికర్రలు భుజాన పెద్ద సంచులు వేసుకున్నారు అయిదారుగురు కల్సి తండావైపు బయలుదేరారు.

ఇలా కప్పలు పట్టేవాళ్ళ వేషంలో బయలుదేరిన పోలీసులు నిమ్మలంగా సిగరెట్లు కాలుస్తూ తండాను సమీపించారు. మిగతావాళ్ళు జీపులో వెనకే వుండిపోయారు.

"ఇంతకు వాడు ఈ తండల్నే వున్నడంటరా" ఒక డడిగాడు.

ఆ స్క్వాడ్‌లో నాయకుడులా కన్పిస్తున్న వాడొకడు విసుక్కున్నాడు. "వాడిక్కన్నె వున్నడని మనకి ఇన్ఫర్మేషన్ రానే వచ్చె, యింకా అనుమానమేందిర - జల్ది నడువుండ్రి - ఆలస్యం జేస్తె వాడవుతలబడ్తడు" అన్నాడు.

"నీయ్యమ్మ! యేం తొవ్వో యిది యేం రాల్లు - ఎండకాలం గాబట్టి వత్తానంగని యింకో కాలంలయితె వచ్చేటానికి వీలుంటద"అని ఒకడు చికాకుపడ్డాడు

"ఈ తండ కసలు తొవ్వేలేదు. వీల్లు యెట్ల దిరుగుతరో యేందో - వీల్లెంబడి బడ్డందుకు మనం గూడ ఈ కంపల్ల కంచె తొవ్వల్ల తిరిగి సావాల్నాయె."

"ఔరా మరి, పని నెత్తిలేసుకున్నప్పుడు యెంత కష్టమయితేంది, తిరుగాలె - ప్రమోషన్లు వట్టిగనె వస్తాయి దే!"

× × ×

"అన్నం దిన్నంక మాట్లాడరాదు" అందామె గిరిభూషణంతో.

పక్కనున్నవాళ్ళు గూడ "నిజమె నిజమె తిన్నంక మాట్లాడుదాం, కాన పొద్దుబోయింది"

అతడు నవ్వుతూ లేచాడు

కుండలో అన్నం అల్యూమినియం ప్లేటులో వడ్డించింది.

ఎండాకాలం అన్ని పగళ్ళలాగె మధ్యాహ్నపు గాలి వేడిగా గూబల్ని అదరగొడుతోంది. నూర్చిన పొలాల్లో మట్టి సుడిగా పైకి లేస్తోంది. ఒక పెద్ద సుడి తండా వైపు దూసుకు వచ్చింది.

బయట చెట్టుకింద కూర్చున్న స్త్రీలు వడగాలికి కొంగులు చెవులమీదికి లాక్కున్నారు.

"యింకొంచెం తిన్రాదు" అందా స్త్రీ గిరిభూషణంతో.

"యిగ బొయ్యేటోన్నె గద, సాలదా తియ్" నవ్వుతూ చెయ్యి కడుక్కున్నాడు అతడు.

మూతి తుడుచుకుంటూ తనకోసం కూర్చున్నవాళ్ళ దగ్గరికివచ్చి మాటలు మళ్ళీ కొనసాగించాడు.

తండా ముందుభాగాన గుడిసెముందు ఆడుకుంటున్న కుర్రవాళ్ళు ఆటల్ని ఆపి తల తిప్పి చూశారు. వాళ్ళకి అయిదారుగురు కొత్త మనుషులు కనపడ్డారు. వాళ్ళ చేతుల్లో పొట్టికర్రలు భుజాన సంచులు వాళ్ళకు చిత్రంగా తోచాయి. "యేంగావాలె" అన్నాడు కుర్రాళ్ళలోని కొంచెం పెద్దవాడు.

546

“అరేయ్ ఆ గుడిసెలకు బోయి గిరిభూషణంతోని యెనలో వచ్చిన్రు మాట్లాడాల్నట రమ్మంటాండ్లు అని చెప్పబో” అన్నాడు ఆ స్క్వాడ్‌లో నాయకుడి లాంటివాడు.

కుర్రవాడు గుడిసెలవేపు పరుగెత్తాడు.

“అయితె కుందేలు ఇక్కన్నే వున్నదిరో” అని రివాల్వరు తమిడి జూసుకొని ముందుకు కదిలాడు నాయకుడు- మిగతావారు అనుసరించారు.

కుర్రవాడు గుడిసెలోపటికి తొంగిచూసి “యెవరో వచ్చిన్రు, మాట్లాడాల్నట” అన్నాడు గిరిభూషణంతో.

గిరిభూషణం ఉలిక్కిపడ్డాడు. యెవరా వచ్చింది, మిత్రులా శత్రులా తన దగ్గిర ఆయుధంగూడాలేదు. అనుమానపడుతూ గుడిసె గుమ్మందగ్గరకు వచ్చాడు. యెదురుగా వస్తున్న వాళ్ళను చూడగానె తెల్సిపోయింది. అంటే నక్సలైట్ స్క్వాడ్! తనని ఇదివరకు యెన్నోసార్లు చంపాలని ప్రయత్నించారు. కాని తాను వెంట్రుకవాసిలో తప్పించుకున్నాడు. ఇప్పుడు ఇక్కడికూడా నీడలా వెంటాడుతూ వచ్చారన్నమాట. యెవడో ద్రోహి సమాచార మిచ్చి వుంటాడు.

వెనక్కి గుడిసెలోకి వెళితె లాభంలేదు. గుడిసెదాటి ముందుకు పరుగెత్తాడు. పరుగెత్తటానికూడా వీల్లేకుండా అడ్డదిడ్డంగా వున్నాయి గుడిసెలు. పది గజాలు పరుగెత్తాడోలేదో వెనక రివాల్వర్ పేలింది. గుండు కాలిలో దిగబడింది. బాధతో అరచి ముందుకి బోర్లాపడ్డాడు. కట్టుకున్న లుంగీ అస్తవ్యస్తంగా కాళ్ళకి అడ్డం పడుతోంది. గుండుదెబ్బ బాధిస్తోంది. అయినా శక్తిని కూడదీసుకొని తుప్పల్లోంచి డొంకల్లోంచి పరిగెడుతున్నాడు.

ఒకేసారి రెండుమూడు రివాల్వర్లు మొరిగాయి- చెట్టుకింద కూర్చున్న స్త్రీల్లో ఒకామె ఆ దృశ్యం చూసి భయంతో అరవబోయింది. రెండో ఆమె చేయిపట్టుకుని లాగి నోరుమూసింది.

గిరిభూషణం మట్టిలో దొర్లాబడిపోయాడు. అతని వీపులో డొక్కలో గుళ్ళు చేసిన గాయాలనుంచి రక్తం స్రవిస్తోంది. కళ్ళు సగం తెరుచుకొని తండాను చూస్తున్నాయి. బిగించిన పిడికిళ్ళ నిండా నల్లటి మట్టి వుంది.